

న్యూస్ బాక్స్

అకాల వర్షాల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మూడురోజుల పాటు అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఒక ప్రకటనలో తెలిపారు.వాతావరణ శాఖ అందించే సమాచారం ప్రకారం 3 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని, కొనుగోలు కేంద్రాల వద్ద, కల్లాల వద్ద ధాన్యం ఆరబెట్టుకున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ధాన్యం తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించాలని, ఎక్కడ వాహనాల కొరత ఉండవద్దని కలెక్టర్ అధికారులకు సూచించారు. అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

కేజ్ వీల్స్ వినియోగిస్తే వాహనాలు సీజ్..


పెద్దపల్లిటౌన్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ కేజ్ వీల్స్ వినియోగిస్తే వాహనాల సీజ్ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరినాట్ల సీజన్ నేపథ్యంలో ట్రాక్టర్ వాహనాలను రోడ్లపై కేజీవీల్స్‌తో నడపడం వల్ల రోడ్లు పాడవుతున్నాయని, రోడ్లపై కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్ నడపడం మొదటిసారి గమనిస్తే వెయ్యి రూపాయల జరిమానా, రెండవసారి గమనిస్తే వాహనం సీజ్ చేస్తామని, కేజీవీల్స్‌తో ట్రాక్టర్ రోడ్లపై నడపవద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అడ్డగుంటపల్లి ప్రైమరీ స్కూల్‌లో గోదావరిఖని టుటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేస్తున్న గట్ల శ్రీనివాస్ శనివారం విద్యార్థులకు నోట్‌బుక్స్ పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో వేగం

- దీర్ఘకాలిక పనులకు మోక్షం
- ఏడాదిలో రూ.2,500 కోట్ల పనులకు శ్రీకారం
- పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి అడుగులు
- రామగుండం బీ థర్మల్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ప్రతిపాదనలు..



అడవి సోమన్‌పల్లిలో న్యూ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

గత ఏడాది అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు మంత్రి, ఎమ్మెల్యేలు ప్రభుత్వం వెంటబడి నిధులు సాధిస్తూ అభివృద్ధిలో దూకుడు పెంచుతున్నారు. ఏడాది కాలంలోనే జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు జిల్లాకు వచ్చి వరాల జల్లులు కురిపించారు. అంతేగాకుండా నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. విద్య, వైద్య, విద్యుత్, రహదారుల అభివృద్ధితో పాటు టూరిజానికి కూడా ప్రాధాన్యతను ఇస్తూ నిధులు మంజూరుచేయించడంతో పాటు ఎస్సారెస్పీ ఆయకట్టు రైతుల చిరకాల వాంఛ అయిన పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణానికి, రామగుండం బీ థర్మల్‌లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం అడుగులు ముందుక పడుతుండడంతో వారి పనితీరుపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతున్నది. ఈ నెల 4వ తేదీ పెద్దపల్లిలో నిర్వహించిన యువ వికాసం బహిరంగ సభకు హాజరైన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జిల్లాలో చేపట్టనున్న 1,024కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం గమనార్హం.

పెద్దపల్లిలో బస్ డిపో ఏర్పాటు..

పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు నిధులు తీసుకవచ్చేందుకు కృషి చేస్తున్నారు. రెండు దశాబ్దాల చిరకాల వాంఛ అయిన పెద్దపల్లికి ఆర్టీసీ బస్సు డిపో మంజూరుచేయగా, సీఎం శంకుస్థాపన చేశారు. బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న 4.31 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం ఉచితంగా కేటాయించింది. పెద్దపల్లి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు ఎప్పటినుంచో ప్రతిపాదనలో ఉన్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.82 కోట్లు. ఓదెల మండలం రూప్‌నారాయణ పేట వద్ద మానేరు వద్ద వంతెన నిర్మాణానికి రూ.80 కోట్లు, ఆర్అండ్‌బీ ద్వారా కాల్వశ్రీరాంపూర్, ఓదెల, ఎలిగేడు,. సుల్తానాబాద్ మండలాలను అనుసంధానం చేసేందుకు, జూలపల్లిలో హుస్సేనిమియా వాగుపై వంతెన నిర్మాణానికి 80 కోట్ల రూపాయలు మంజూరయ్యాయి. గ్రంథాల భవనానికి రూ.5 కోట్లు, మహిళా ప్రాంగణం భవనానికి రూ.5 కోట్లు, జడ్పీ భవనానికి రూ.8.15 కోట్లు, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాల భవనాలకు ఒక కోటి, కాల్వశ్రీరాంపూర్ కేజీబీవీ పాఠశాలలో అదనపు తరగతి గదులు, ల్యాబ్ కోసం రూ.3.25 కోట్లు మంజూరు చేశారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీ ద్వారా రూ.77.90 కోట్లు, సుల్తానాబాద్ మున్సిపాలిటీలో రూ.31.55 కోట్ల నిధులు మంజూరుచేయగా పనులు నడుస్తున్నాయి. పెద్దపల్లిలో బాలికల జూనియర్ కళాశాల భవనానికి రూ.20 కోట్లు మంజూరు చేయగా, ఎన్నో ఏళ్లుగా పెండింగులో గల పెద్దపల్లి రూరల్, మహిళా, ట్రాఫిక్, ఎలిగేడు పోలీస్‌స్టేషన్లు మంజూరయ్యాయి. పెద్దపల్లి ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం, కాచాపూర్, రంగాపూర్‌లో సబ్ స్టేషన్ల నిర్మాణాలకు రూ.25.89 కోట్లతో చేపట్టనున్న పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క శ్రీకారం చుట్టారు. న్యూ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన సముదాయ నిర్మాణానికి రూ.250 కోట్లు, పెద్దపల్లి ఆసుపత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తూ రూ.51 కోట్లు మంజూరు చేశారు.

మంథని రింగు రోడ్డుకు రూ.162 కోట్లు..

మంథని నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నారు. మంథని పట్టణం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మాణానికి 162 కోట్లు, మానేరుపై మంథని మండలం శివ్వారం వద్ద మానేరుపై మరో వంతెన నిర్మాణానికి 125 కోట్ల రూపాయలు మంజూరుచేశారు. ఈ పనులకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రామగిరిఖిల్లా, మంథని సర్క్యూట్‌గా పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు 6 కోట్ల రూపాయలతో పనులను ప్రారంభిస్తున్నారు. మంథని, పోతారంలో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు రూ.10 కోట్లు అడవి సోమన్‌పల్లిలో న్యూ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన సముదాయ నిర్మాణానికి రూ.250 కోట్లు మంజూరుకాగా, మంత్రి శ్రీధర్‌బాబు భూమిపూజ చేశారు. మంథనిలోగల 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి రూ.5 కోట్లు, గుంజపడుగులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.2.43 కోట్లు, మంథని పట్టణంలో పలు అభివృద్ధి పనులకు రూ.30 కోట్లు మంజూరు చేయించారు. ఎల్‌మడుగుకు వెళ్లే రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఎక్లాస్‌పూర్-ఖమ్మపల్లి రోడ్డు వెడల్పుకు రూ.11.90 కోట్లు, ఖానాపూర్ నుంచి ఎల్.మడుగు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి 7 కోట్లు రూపాయలు, పెంచికల్‌పేట్ నుంచి ఎఫ్‌సీఐ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్లు, రాజాపూర్ బండలవాగుపై వంతెన నిర్మాణం, మంగపేట రోడ్ కోసం రూ.3 కోట్లు,

మిగతా 6వ పేజీలో...

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న మనాలీఠాకూర్

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వల్లి సహిత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం పలు ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. గోదావరిఖని జీఎం కాలనీలోని హనుమాన్ ఆలయంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సతీమణి మనాలీ ఠాకూర్ స్వామి వారికి పట్టువస్త్రాలను, తలంబ్రాలను అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా దత్తాత్రేయస్వామి నవరాత్రోత్సవాలు

మంథని, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో స్వామివారి నవరాత్రి ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గర్భాలయంలోని దత్తాత్రేయస్వామి వారికి, ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. 9 రోజులపాటు స్వామి వారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించడం తోపాటు భక్తులకు అన్నదానం, ప్రసాద వితరణ చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు..

మంథనిలోని అయ్యప్పస్వామి ఆలయ అవరణలోని ఉన్న సుబ్రహ్మణ్య స్వామికి, మండలంలోని గాజులపల్లి సంతాన నాగేంద్రస్వామికి భక్తులు శనివారం అభిషేకాలు, అర్చనలు, పూజలు వైభవంగా చేశారు. శ్రీవల్లి-దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలకు వేద పండితుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కళ్యాణ క్రతువును నిర్వహించారు.

అకాల వర్షం.. తడిసిన ధాన్యం..



ధర్మారం మార్కెట్‌లో ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీగా వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన వరిధాన్యం పూర్తిగా తడిసింది. దీంతో పాటు ధాన్యంపై కప్పిన టార్పాలిన్‌లు తడిసి వర్షపు నీరు నిలిచాయి. ఓ వైపు తడిసిన ధాన్యంను వేరుచేయడంతో పాటు కుప్పలు చుట్టూ నిలిచిన నీటిని తొలగించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ప్రభుత్వం తడిసిన ధాన్యంను తూకం వేసి కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

● ఓదెల (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంతోపాటు పొత్కపల్లి, కనగర్తి, కొలనూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో వర్షం కురుస్తున్న సమయంలో ఓదెల రైల్వే గేట్ వద్ద ఉన్న రాజు అనే విద్యార్థి వేగంగా వీచిన గాలికి కొంతదూరం సైకిల్‌తో కొట్టుకెళ్లాడు. అక్కడున్న కొంతమంది కాపాడారు. వర్షానికి నారుమళ్లకు నష్టం కలిగింది.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం రాత్రి, శనివారం మధ్యాహ్నం అకస్మాత్తుగా వర్షం పడడంతో కొనుగోలు కేంద్రాలలోని రైతులు ఇబ్బందులు పడ్డారు. కవర్లు కప్పి ధాన్యం కుప్పలను కాపాడుకుంటున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటికే దాదాపు 80శాతం ధాన్యం కొనుగోలు పూర్తయినా, మిగిలిన రైతుల ధాన్యం మ్యాచర్ రాక కొనుగోలు కేంద్రాల్లోనే గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 95శాతం ధాన్యం కొనుగోలు చేశామని, మిగిలిన ధాన్యాన్ని మ్యాచర్ రాగానే కొనుగోలు చేస్తామని వ్యవసాయ మార్కెట్ సెక్రెటరీ సరోజ తెలిపారు.

నియామకం

పెద్దపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్లాండ్‌లో జరిగిన తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ న్యూజిలాండ్ సర్వసభ్య సమావేశంలో జూలపల్లి మండల కేంద్రానికి చెందిన కోదూరి చంద్రశేఖర్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి నాయకుడిగా, ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు యువత రాష్ట్ర నాయకుడిగా పనిచేశారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎలిగేడు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే విజయరమణారావును శనివారం పెద్దపల్లి మున్సిపల్ కౌన్సిలర్ తాడూరి పుష్పకళతో పాటు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ సన్మానించారు. ఏడాదిలో నియోజకవర్గ అభివృద్ధికి వెయ్యికోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించినందుకు అభినందనీయమన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టేపల్లి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో శనివారం సరస్వతి అమ్మవారి విగ్రహాన్ని ఉపాధ్యాయులు నాగమణి-వేణు దంపతులు ఆవిష్కరించారు. విగ్రహాన్ని గ్రామానికి చెందిన డాక్టర్ ఆరే సతీష్-సౌమ్య దంపతులు ప్రభుత్వ పాఠశాలకు అందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ కొలిపాక పెద్దన్న, దామోదర్‌రావు, శీలం శంకర్, తుమ్మ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



డ్రా ద్వారా ఇళ్లను కేటాయిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు..

- జంగాలపల్లిలో 634 మందికి డ్రా ద్వారా ఎంపిక

6



ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న డైరెక్టర్ రవీంద్ర

రామగుండం ఎన్టీపీసీలో ముగిసిన డైరెక్టర్ పర్యటన

- ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టు పనితీరు పరిశీలన..

6

కేంద్రానివి కార్మిక వ్యతిరేక విధానాలు..

హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్‌రావు



ప్రసంగిస్తున్న హెచ్ఎంఎస్ జాతీయ కార్యదర్శి సుదర్శన్‌రావు

జ్యోతినగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మిక వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతున్నదని హింద్ మజ్దూర్ సభ(హెచ్ఎంఎస్) జాతీయ కార్యదర్శి ఎస్.సుదర్శన్‌రావు అన్నారు. శనివారం ఎన్టీపీసీలోని శ్రీమయి గ్రాండ్‌లో జరిగిన హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్పొరేట్, పెట్టుబడి వర్గాలకు మేలు కలిగించేలా కేంద్ర ప్రభుత్వ చర్యలున్నాయని ఆరోపించారు. లాభాల్లో ఉన్న వందలాది పబ్లిక్ సెక్టార్ సంస్థలను ప్రైవేటుపరం చేస్తున్నదని, నవరత్న కంపెనీలను ప్రైవేటుపరం చేస్తోందన్నారు. ఎన్నో ఉద్యమాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను మోదీ సర్కారు సవరించి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందన్నారు. లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని, హక్కులన్నీ హరించదుతాయన్నారు. సమ్మె చేసే హక్కు పోతుందని, కార్మికులకు ఉద్యోగ భద్రత ఉండదని, పని గంటలు పెరుగుతాయని తెలిపారు. కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ వ్యవస్థకు మనుగడ లేకుండా పోతుందన్నారు. దేశంలో కార్మికులకు కనీస వేతనాలు వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా లేవని తెలిపారు. ఒకే సంస్థలో పనిచేసే అధికారికి, కార్మికుడికి మధ్య వేతనాలలో భారీ వ్యత్యాసం ఉందన్నారు. కనీస వేతనాల సవరణ విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో 12ఏళ్లపాటు కనీస వేతనాలను సవరించ లేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వచ్చిన తరువాత కార్మికులకు మేలు జరుగుతుందని భావించామని, అయితే అందుకు భిన్నంగా కాంగ్రెస్ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలనే అనుసరిస్తోందని సుదర్శన్‌రావు ఆరోపించారు. కార్మిక చట్టాల సవరణ, కార్మిక వ్యతిరేఖ విధానాలపై బీఎంఎస్ మినహా 12 జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్త ఉద్యమాలు చేస్తున్నాయని, కార్మికులు, ప్రజల భాగస్వామ్యంతో కేంద్రంపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దశాబ్దాల కాలంగా హెచ్ఎంఎస్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతుందని, అదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో ముందుకువెళ్తామన్నారు. యూనియన్‌ను మరింత బలోపేతం చేసే దిశగా నాయకత్వం కృషి చేస్తుందని తెలిపారు. సవవేశంలో హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్.ఉపేందర్, పి.నర్సయ్య, కుమారస్వామి, కార్యవర్గ సభ్యులు ఈశ్వర ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే వివేక్

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సుల్తానాబాద్ పట్టణానికి చెందిన తెలంగాణ మాదిగ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆరేపల్లి జితేందర్ కుటుంబాన్ని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పరామర్శించారు. జితేందర్ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. జితేందర్ గత నాలుగు దశాబ్దాల నుంచి వెంకటస్వామి కుటుంబానికి దగ్గర నాయకుడిగా ఉన్నారు. జితేందర్ మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న వివేక్ శనివారం సుల్తానాబాద్‌లోని నివాసానికి వచ్చి జితేందర్ భార్య కుమారుడిని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

టీబీ రహిత సమాజం కోసం కృషి చేయాలి

- డీఎంహెచ్‌వో అన్న ప్రసన్నకుమారి



జెండా ఊపి వాహనాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో ప్రసన్న కుమారి

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్షయ రహిత సమాజం కోసం జిల్లాలో ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, ప్రభుత్వ లక్ష్యాన్ని వంద శాతం సఫలం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి అన్న ప్రసన్నకుమారి అన్నారు. మండలంలోని గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం నిక్షయ్ శివిర్‌ను డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా క్షయ నివారణ, నిర్మూలన కోసం వంద రోజుల ప్రత్యేక కార్యక్రమం గురించి ఆమె వివరించారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా పలు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టులుగా ప్రభుత్వం ఎంపిక చేసిందని, రాష్ట్రంలో 9 జిల్లాలు ఎంపికకాగా, అందులో పెద్దపల్లి కూడా ఉందన్నారు. సమాజంలో ముందుగా క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సకాలంలో చికిత్సలు మొదలుపెడితే వ్యాధి నయం అవుతుందని అన్నారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని ఆమె పచ్చజెండా ఊపి ప్రారంభిం చారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు కావేటి రాజగోపాల్, రాష్ట్ర కమిటీ మెంబర్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీబీఎస్ మూర్తి, విష్ణు, ప్రపంచ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ కేవీ సుధాకర్‌రెడ్డి, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ప్రోగ్రాం అధికారి రివిసింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ అనుదీప్, జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు, కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు, కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడు మంద రవి కుమార్ కోరారు. జిల్లాలో శనివారం నిర్వహించిన ఆటోల బంద్ విజయవంతం అయినట్లు పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆటో సమస్యలపై పరిష్కారం చూపెట్టాలని, లేనియెడల చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడతామని రవికుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట రాజయ్య, అంబాల శంకర్, సదానందం, గాజుల రాజశేఖర్, మట్ట నర్సయ్య, చిలుముల కుమార్, ఎనగందుల నాంపల్లి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆటోల సమస్యలపై పోస్టర్లను ఆవిష్కరించారు.

● సుల్తానాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీ ఏడాది దాటినా అమలు చేయలేదని నిరసిస్తూ ఆటోడ్రైవర్లు సుల్తానాబాద్‌లో ఆందోళన చేశారు. తెలంగాణ ఆటో డ్రైవర్ల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు వారు సుల్తానాబాద్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దాకు వినతపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎనగందుల నాంపల్లి, బండ సురేష్, కోటగిరి స్వామి, పల్లె శ్రీనివాస్, పెగడ అంజనేయులు, ఆకుల అరుణ్ తదితరులు ఉన్నారు.

షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్‌పై చర్యలు తీసుకోవాలి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వెలమ సంఘం నాయకులు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ వెలమలపై అనుచిత వాఖ్యలు చేయడంతో పాటు చంపుతానని బెదిరించడాన్ని ఖండిస్తున్నామని, అతనిపై వెంటనే చర్యలు తీసుకుని అనర్హత వేటు వేయాలని రామగుండం వెలమ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు నడిపెల్లి రాంమోహన్‌రావు, సాగర్‌రావు, అమరేందర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖనిలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ వెలమలను చంపుతామని పరుషపదజాలంతో దూషించడం సరైంది కాదన్నారు. వ్యక్తిగతంగా వెలమలపై అసభ్యంగా మాట్లాడి తమ మనోభావాలను దెబ్బతీశారని వారు ఆరోపించారు. ఎమ్మెల్యే శంకర్ భౌతిక దాడులకు పాల్పడుతామంటూ హెచ్చరించడాన్ని యావత్ వెలమ సంఘం ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో నాయకులు రాజేశ్వర్‌రావు, మహేందర్‌రావు, రంగారావు, రవీందర్‌రావు, వెంకటేశ్వర్‌రావు, కృపాకర్‌రావు, సాగి వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రావు, కిషన్‌రావు, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

వెలమలపై అసభ్య పదజాలంతో దూషించిన షాద్‌నగర్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఇంద్రసేనారెడ్డికి వెలమ సంఘం అధ్యక్షులు రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. భౌతిక దాడులు చేస్తాం, చంపేస్తామంటూ అసభ్య పదజాలంతో దూషించారని, ఎమ్మెల్యే శంకర్‌పై కేసు నమోదు చేయాలని వారు కోరారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థికపరమైన ఇబ్బందులతో కుటుంబ పోషణ భారమై కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన మోదేపల్లి శివకుమార్(25) అనే యువకుడు శుక్రవారం అర్ధరాత్రి ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. శివకుమార్ అదే గ్రామానికి చెందిన యువతిని నాలుగు సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకున్నాడు. దంపతులకు ఏడాది వయస్సు గల కూతురు ఉంది. శివకుమార్ కొంతకాలం ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేశాడు. జీతం సరిపోవటం లేదని మూడు నెలల కిందట ఉద్యోగం మానేశాడు. ఇంటివద్దనే ఉంటూ ప్లంబర్ పనిచేస్తుండేవాడు. డబ్బులు లేక కుటుంబపోషణ భారమవుతోందని శివకుమార్ బాధపడుతుండేవాడని మృతుడి భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం రాత్రి బంధువుల ఇంటిలో శుభకార్యం ఉండటంతో అక్కడి వెళ్లి తిరిగి రాత్రి శివకుమార్ ఒక్కడే ఇంటికి చేరుకున్నాడు. శనివారం ఉదయం కుటుంబసభ్యులు చూసే సరికి శివకుమార్ ఉరికి వేళాడు తూ కనిపించాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య స్వరూప ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆటో ఢీకొని ఒకరి దుర్మరణం


కనకయ్య(ఫైల్)

తిమ్మాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై శుక్రవారం సాయంత్రం రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రగాయాలై చికిత్స పొందు తూ మృతిచెందాడు. ఎల్‌ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నుస్తులాపూర్ గ్రామానికి చెందిన తమ్మనబోయిన కనకయ్య(63) తన గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి గొర్రెలను తరలిస్తూ రోడ్డు దాటుతున్నాడు. ఆ సమయంలో అతి వేగంగా వస్తున్న ఆటో (టీఎస్36టీ5538) కనకయ్యను ఢీకొట్టింది. కనకయ్య కింద పడి తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. కనకయ్య కుమారుడు సంపత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మానకొండూరు, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామానికి చెందిన గొండ పెద్దన్న(65) అనే సింగరేణి విశ్రాంత ఉద్యోగి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కొంతకాలంగా పెద్దన్నకు ఇంటిముందు ఉన్న ఖాళీ స్థలం విషయంలో పక్కింటి వారితో గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపా నికి గురై గత నెల 21న నిద్రమాత్రలు వేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. 17 రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

పురుగుల మందు తాగిన యువతి మృతి

వీణవంక, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన ఎల్కపల్లి శిరీష (22) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన మైస శ్రీనాథ్ అనే వ్యక్తి శిరీషను పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేశాడు. దీంతో పాటు ఆమెను మానసికంగా వేధించడంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 5వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యు లు జమ్మికుంటలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ శనివారం శిరీష మృతి చెందింది. శిరీష తల్లి ఎల్కపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆమె ఆత్మహత్యకు కారణమైన మైస శ్రీనాథ్, మైస సుశీల, మైస సారయ్యపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తోట తిరుపతి తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


ఎల్లారెడ్డిపేట డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి బస్టాండ్ ప్రాంతంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గొల్లపల్లి బస్టాండ్ సమీపంలోని కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారి పక్కన అదే గ్రామానికి చెందిన మహిళ లక్ష్మి నిలబడి ఉంది. బోప్పాపూర్ లోని వ్యక్తి బోండ్ల బాలకిషన్ తన ద్విచక్ర వాహనంపై యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మహిళను ఢీ కొట్టినాడు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

తంగళ్లపల్లిలో చోరీ


పగుల గొట్టి ఉన్న బీరువా

తంగళ్లపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలో కోడం విజయ ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లగా గుర్తు తెలియని దుండగులు తాళం పగులగొట్టి బీరువాలోని రూ. 90 వేల నగదు ఎత్తుకెళ్లారు. వారంరోజుల క్రితం కోడం విజయ కుటుంబం ముంబాయి వెళ్లగా శనివారం తెల్లవారుజామున ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ రామ్మోహన్ పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మానాల అటవీ ప్రాంతం



ఉద్యమాల చిరునామా మానాల

- నాడు సాయుధ శిక్షణ కేంద్రంగా అడవులు
- నేడు కనుమరుగవుతున్న వృక్ష సంపద
- అటవీ భూములను ఆక్రమిస్తున్న అక్రమార్కులు
- రక్షించాలని కోరుతున్న ప్రజలు


మానాలలో అమర వీరుల స్తూపం

రుద్రంగి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లాలోని రుద్రంగి మండలం మానాల అడవులకు ఎంతో ఉద్యమ చరిత్ర ఉంది. మానాలలోని అడవులు, గుట్టల్లో సాయుధ దళాలకు శిక్షణ శిబిరాలను నిర్వహించేవారు. తెలంగాణ సాయుధ పోరాటం నుంచి మావోయిస్టు దళాల సభ్యుల వరకు ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ఉద్యమాల్లో భాగస్వాములయ్యేవారు. అయా ప్రాంతాల్లో పోరాటాల్లో గాయపడిన సభ్యులకు ఈ ప్రాంతానికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించేవారు. ఆ ఆనవాళ్లు ఇప్పుడు కనుమరగవుతున్నాయి. అక్రమార్కుల గొడ్డలి వేటుకు మానాల అడవుల్లోని వృక్ష సంపద, గుట్టలు అంతరించిపోతున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల సరిహద్దులోని మానాల గిరిజన ప్రాంతం. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుంచి సిరిసిల్ల జిల్లా పరిధిలోకి మారింది. లోకం పోకడ ఎరుగని మారుమూల పల్లె మానాల, అక్కడి మనుషులకు ప్రపంచంతో సంబంధాలు ఉండేవి కావు. కానీ మానాల అంటే చరిత్ర పుటల్లో మాసిపోని పోరాట వేదిక. అమాయకులైన ఇక్కడి ప్రజలు అనేక పోరాటాలను గుండెల్లో పెట్టుకున్నారు. మానాల ఆడవులు దట్టమైనవి కావడంతో తెలంగాణ సాయుధ పోరాటంలో గెరిల్లా దళాలకు ఇక్కడ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసేవారు. శిక్షణ అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో తెలంగాణ రైతాంగ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద మహిళా అమరవీరుల రెండో స్తూపం ఇక్కడ నిర్మించారు.

● అడవుల్లోకి భూ అక్రమార్కులు

ఉద్యమ చరిత్ర ఉన్న మానాల అడవుల్లోకి భూ అక్రమార్కులు


నరికివేతకు గురైన వృక్షం

చొరబడ్డారు. చెట్లను అక్రమంగా నరుకుతూ భూములను చదును చేస్తున్నారు. చట్టాల్లోని లొసుగులను ఆసరాగా చేసుకొని అటవీ భూముల ఆక్రమణకు పాల్పడుతున్నారు. వ్యవసాయ భూములుగా మారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. రుద్రంగి మండల కేంద్రం శివారులోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయం నుంచి మొదలుకొని మానాల వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న గాది గుట్ట తండా వరకు అటవీ ప్రాంతంలో సూమారు 40 నుంచి 50 ఎకరాల వరకు వృక్ష సంపదను నేల మట్టం చేశారు. సీమర్ల అటవి ప్రాంతంలోనూ భారీ వృక్షాలను నరికి వేశారు. మానాల గ్రామం శివారులో కొన్ని సంవత్సరాల క్రితం అటవీ ప్రాంతం అన్యాక్రాంతం కావడంతో అప్పటి అటవీ అధికారులు సూమారు 40 ఎకరాల్లో నీలగిరి మొక్కలతో ప్లాంటేషన్ చేశారు. అయితే అవి వృక్షాలుగా మారాయి. ప్రస్తుతం కొద్ది రోజుల నుంచి నీలగిరి చెట్లను నరికి భూములను ఆక్రమించేందుకు కొందరు, కలపను అమ్ముకునేందుకు మరికొందరు చెట్లను నరికి వేస్తున్నారు. అంతే కాకుండా ఎంతో విలువైన టేకు కలప, వన మూలికల చెట్లను నరికి లక్షల రూపాయలు దండుకుంటున్నారు. దీంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి చేరుతున్నాయి. అంతరించి పోతున్న అడవులను కాపాడాలని రెండు జిల్లాలోని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని బియ్యాన్ని, ఒక వాహనాన్ని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ సదన్ కుమార్ శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజురాబాద్ నుంచి వేములవాడ వైపు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు వేములవాడ పట్టణ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంకెపల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఒక వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా నిరంతర నిఘా పెడుతూ విస్తృతస్థాయిలో దాడులు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్రమ రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వేములవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చందుర్తి: చందుర్తి మండలం ఎనగల్ గ్రామ శివారులోని ఎస్‌ఆర్‌ఆర్ రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టుకున్నట్లు డీటీసీఎస్ రవీంద్రచారి తెలిపారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వసంతలక్ష్మి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. హుజూరాబాద్ నుంచి ఎనగల్ గ్రామశివారులోని రైస్‌మిల్లుకు తరలిస్తున్న 70 క్వింటాళ్ల బియ్యం, రైస్‌మిల్లును సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిరిసిల్ల డీటీసీఎస్ నవీన్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరి రిమాండ్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7: నగరానికి చెందిన ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ పోలీసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలిక కుటుంబసభ్యులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శాస్త్రీరోడ్‌కు చెందిన మహ్మద్ సిరాజొద్దీన్‌ను అరెస్టు చేశారు. శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

సహజ వనరులను కొల్లగొడుతున్న మోదీ ప్రభుత్వం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని సహజ వనరులను కొల్లగొడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అధ్యక్షతన పార్టీ రాష్ట్ర నాయకులు బాల మల్లేష్(రంగారెడ్డి), పోటు ప్రసాద్(ఖమ్మం) సంస్మరణ సభ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో చాడ వెంకటరెడ్డి మాట్లాడారు. ఆదానీ, అంబానీ, నీరవ్ మోదీ బ్యాంకుల్లో అప్పులు తీసుకొని ఎగ్గొట్టి విదేశాల్లో దాక్కున్నారన్నారు. నీరవ్ మోదీని అప్పగించాలంటూ బ్రిటన్ ప్రభుత్వంపై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేక పోతున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సంవత్సరకాలం పూర్తి చేసుకుందని సంబరాలు చేసుకుంటున్నారని, ఏడాదిలో రాష్ట్రంలో ఏం చేశారని ఒక్కసారి నెమరు వేసుకోవాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలన్నారు. సిరిసిల్ల పవర్‌లూం కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు మీసం లక్ష్మన్, కడారి రాములు, కేవీ అనసూయ, మల్లేశం, తిరుపతిరెడ్డి, విజయ్, రంజిత్, లక్ష్మి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రముఖులు



హైకోర్టుకు జడ్జికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఏఈఓ, కోడెమొక్కు చెల్లించుకుంటున్న డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరావు

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని హైకోర్టు జడ్జి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సభ్యులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలో పాల్గొని రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకున్నారు. అధికారులు రాజన్న ప్రసాదాన్ని అందించారు.

రోడ్డుప్రమాదంలో పలువురికి గాయాలు

సుల్తానాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ఆర్టీసీ బస్టాండ్ వద్ద శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు సుల్తానాబాద్ బస్టాండ్ లోకి వెళ్తుండగా కరీంనగర్ వైపు నుంచి రాజీవ్ రహదారిపై వేగంగా వచ్చిన ఓ వాహనం బస్సును ఢీకొంది. ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులు కొందరు స్వల్పంగా గాయపడ్డారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్ గ్రామం వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని డ్రైవర్, యజమానులపై కేసు నమోదు చేశామని రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రా మంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని ఎస్‌ఐ తోట తిరుపతి శనివారం ఒక ప్రటనలో తెలిపారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతుల ఆసక్తి

- పలు ప్రోత్సాహకాలు కల్పిస్తున్న రాష్ట్రప్రభుత్వం
- తక్కువ పెట్టుబడి.. చీడపీడల బాధ లేదు
- టన్ను గెలలకు రూ. 20,413


వేగురుపల్లిలో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంట



మానకొండూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలంలోని వివిధ గ్రామాల్లోని రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. మండలంలో ఏడు క్లస్టర్లలో 72 మంది రైతులు 250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ రకాల సబ్సిడీలు అందుతుండడంతో ఎక్కువ మంది రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఎక్కువగా పెట్టుబడి పెట్టాల్సిన అవసరం లేదు. ఒక్కసారి దిగుబడి ప్రారంభమైతే 40 ఏళ్ల వరకు ఆదాయం వస్తుంది. కూలీలు, కోతులు, పశువుల సమస్య లేకపోవడంతో రైతులు ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

● సబ్సిడీలు.. ప్రోత్సాహకాలు

ఎకరం భూమిలో సుమారు 57 మొక్కలను నాటవచ్చు. వీటి సంరక్షణకు రాష్ట్రప్రభుత్వం డ్రిప్ సిస్టంపై ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఐదు ఎకరాల్లోపు సాగు చేస్తున్న బీసీ, ఓసీ రైతులకు 90 శాతం సబ్సిడీ ఇస్తుంది. ఐదు ఎకరాలపై సాగు చేసిన రైతులకు 80 శాతం సబ్సిడీ కాగా 20 శాతం జీఎస్టీని సదరు రైతు చెల్లించాల్సి ఉంటుంది. ఐదు ఎకరాల్లోపు ఉన్న సన్నకారు రైతుల తోటల్లో ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా మొక్కలకు గుంతలు తవ్వి ఎరువులను ఉచితంగా అందజేస్తారు. మొక్కలను సంరక్షించడానికి ఎకరాన రైతుకు ఏటా 4,200 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుంది.


మానకొండూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● ఎకరానికి రూ. 1.5 లక్షల ఆదాయం

ఆయిల్‌పామ్ 30 నుంచి 40 ఏళ్ల పంట కాగా 36 నెలలకు పంట కోతకు వస్తుంది. ఎకరాన 10 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు 20,413 రూపాయల ధర ఉండడంతో రెండు లక్షల విలువైన పంట దిగుబడి వస్తుంది. పెట్టుబడులు, కూలీ ఖర్చులు ఎకరానికి 50 వేల రూపాయలు పోను రైతులకు సుమారు లక్షన్నర ఆదాయం వస్తుంది. పత్తి, మిర్చి, వరి ఇతర పంటల్లాగా ఆయిల్‌పామ్‌కు చీడపీడల బాధలేదు. ఎలాంటి వాతవరణ పరిస్థితులనైనా తట్టుకోవడం ఈ పంట ప్రత్యేకత. కోతులు ఇతర పశువులు ఈ గెలలను, చెట్లను ముట్టుకోవు. తక్కువ నీళ్లు ఉన్నప్పటికి డ్రిప్ సాయంతో సాగు చేయవచ్చు. దళారుల సమస్య లేకుండా ఫ్యాక్టరీలు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు పంటను తీసుకవస్తే వారే కాంటా వేసి సరుకును తీసుకుంటారు. రెండు రోజుల్లో ఆన్‌లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో డబ్బులు డిపాజిట్ అవుతాయి. ఆయిల్‌పామ్‌కు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు రిలీజ్ చేస్తుంది. ఆయిల్‌పామ్ చెట్ల మధ్యలో అంతర పంటలను సాగు చేసుకొని అదనపు ఆదాయం పొందవచ్చు.

ఏడెకరాల్లో సాగు

- నందికొండ ముత్తారెడ్డి, రైతు, వేగురుపల్లి



నాకు గ్రామంలో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో వరి, ఆరుతడి పంటలను సాగు చేసేవాడిని. ఈ పంటలను సాగు చేయడానికి పెట్టుబడితో పాటు కూలీల కొరత ఉండేది. దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. ఈ పరిస్థితుల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలనే ఆలోచన వచ్చింది. ముందుగా ఐదున్నర ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశాను. మరో ఏడాదికి మిగతా ఎకరంన్నర భూమిలో మొక్కలను పెట్టాం. నీరు, కూలీల అవసరం తగ్గింది. పెట్టుబడి తగ్గింది. ఆయిల్ పామ్ మొక్కల మధ్య అంతర పంటలైన కూరగాయలు, బంతిపూలు సాగు చేశాము. మంచి లాభాలు వచ్చాయి. ప్రస్తుతం ఆయిల్‌పామ్ చెట్లకు గెలలు వచ్చి కోత దశకు వచ్చాయి. మార్కెట్లో ధర బాగుందని సంబంధిత అధికారులు చెప్పారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకునేది లేదు

- రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల ధర్నా

వేములవాడ కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి భక్తుల మనోభావాలు దెబ్బతీస్తే చూస్తూ ఊరుకునేది లేదని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ హెచ్చరించారు. వరంగల్ జిల్లా గీసుకొండలో కోడెలు పట్టుబడటంపై బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు విడివిడిగా రాజన్న ఆలయంలో నిరసన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆలయ ఈవో కార్యలయం ఎదుట బైఠాయించారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో నమ్మకంతో భక్తులు రాజన్నకు చెల్లించుకునే కోడెలను వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి అనుచరుడైన రాంబాబుకు అందజేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, నాయకులు నిమ్మశెట్టి విజయ్, వంగల శ్రీకాంత్, నీలం శేఖర్, గోలి మహేష్, మారం కుమార్, వాసాల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు రేగుల సంతోష్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆలయ ఈవో కార్యలయంలో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. రాజన్న కోడెలు పక్కదారి పట్టాయని వస్తున్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సగ్గు రాహుల్, నామాల శేఖర్, పిన్నింటి హన్మాండ్లు, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

● వేములవాడ రాజన్న ఆలయ కోడెల తరలింపుపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ స్పందిస్తూ కోడెలు పక్కదారి ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


బీఆర్‌ఎస్ నాయకులతో మాట్లాడుతున్న ఈవో వినోద్‌రెడ్డి

ఉపాధ్యాయుల కొరతపై విద్యార్థులు, తల్లిదండ్రుల ధర్నా



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గంభీరావుపేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాలకు తాళం వేసి ధర్నా చేశారు. ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని తల్లిదండ్రులు ఆరోపించారు. పాఠశాలలో ఏడు తరగతులకు ముగ్గురే ఉపాధ్యాయులు ఉండడంతో చదవులు ముందుకు సాగడం లేదన్నారు. ముగ్గురిలో ఒకరిని డిప్యూటేషన్‌పై పంపేందుకు మౌకిక ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపే అంశాన్ని జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందన లేకపోవడంతో ఆందోళన చేశామన్నారు. అనంతరం విద్యార్థులను పాఠశాల నుంచి ఇళ్లకు తీసుకెళ్లారు.

ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ తనిఖీలు



రికార్డులను తనిఖీ చేస్తున్న అదనపు డీసీపీ రాజు

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆర్మ్‌డ్ హెడ్ క్వార్టర్స్‌లో అదనపు డీసీపీ(అడ్మిన్) సీ రాజు శనివారం తనిఖీలు జరిపారు. సాయుధ దళ పోలీసు కవాతు తరువాత టర్న్ అవుట్ పరిశీలన జరిపారు. సెర్మోనియల్ డ్రిల్ సిబ్బంది పరేడ్ తనిఖీ చేశారు. ఏఆర్ సిబ్బంది సమస్యలు తెలుసుకుని వాటికి త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఏఆర్ సిబ్బంది సివిల్ సిబ్బందికి సహకారం అందిస్తున్నారని, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమానంగా పని చేస్తున్నారన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. ఆర్‌ఐ ఆఫీస్, రికార్డు రూమ్, బెల్లప్ ఆర్మ్స్, బీడీ టీమ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్‌ఐలు దామోదర్, శ్రీనివాస్, మల్లేషం, సంపత్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

'శాతవాహన'లో ఉద్యోగాల పండుగ

- మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన - 50 కంపెనీలు హాజరు
- 427 మందికి ఉద్యోగాలు



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్ చిరంజీవులు

గణేశ్‌నగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో శాతవాహన యూనివర్సిటీలో శనివారం మెగా జాబ్‌మేళాను నిర్వహించారు. ఈ మేళాకు విశేష స్పందన లభించింది. 50 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ ఆధికారి చిరంజీవులు మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో ఇంతపెద్ద జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉద్యోగం ఊరికే రాదని, కష్టపడి చదవాలని సూచించారు. ఎస్‌యూ ఉపకులపతి ప్రొఫెసర్ యు ఉమేష్‌కుమార్ మాట్లాడుతూ యూనివర్సిటీ స్థాయిలో మొట్టమొదటి సారిగా జాబ్‌మేళాను నిర్వహించామన్నారు. రెండువేల పైచిలుకు విద్యార్థులు ఉద్యోగాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. యూనివర్సిటీలో సంవత్సరంలో రెండుసార్లు జాబ్ మేళా నిర్వహిస్తామన్నారు. జాబ్ మేళాలో 2,649 మంది పాల్గొనగా 427 మంది నియామక పత్రాలు అందుకున్నారన్నారు. 845 మందిని షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం వరప్రసాద్, ప్లేస్మెంట్ డైరెక్టర్ డాక్టర్ ఇ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులు



● ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది

పావని, మంథని జేఎన్టీయూ

యూనివర్సిటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొని ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. కార్యక్రమంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాకు అవకాశం కల్పించిన యూనివర్సిటీ అధికారులకు కృతజ్ఞతలు.



● పలు అంశాలపై అవగాహన కల్పించారు..

జి సాయిరిషీంద్ర, కరీంనగర్

జాబ్ మేళాలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇది నాలో ఆత్మస్థయిర్యాన్ని నింపింది. మంచి కంపెనీలో ఉద్యోగం పొందాను. ఆనందంగా ఉంది.



● మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చింది..

వైష్ణవి, హైదరాబాద్

ఉద్యోగానికి వెళ్లినప్పుడు ఇంటర్వ్యూదే ముఖ్యపాత్ర. ఇంటర్వ్యూలో ఎలా మాట్లాడాలి.. రెస్యూమ్ ఎలా తయారు చేసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. మంచి కంపెనీలో ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.



● ప్రముఖ కంపెనీలు.. ఒకే వేదికపై..

- డి తేజవర్ధన్

రాష్ట్రంలోని ప్రముఖ కంపెనీలు యూనివర్సిటీలో ఒకే వేదికపై జాబ్‌మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. ఈ మేళా గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఇంటర్వ్యూలకు హైదరాబాద్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉండేది. ఇక్కడికే అన్ని ప్రముఖ కంపెనీలు రావడంతో ఆర్థిక భారం తగ్గింది.



● నా కల నెరవేరింది..

- టి అరుణ్, శాతవాహన యూనివర్సిటీ

నేను శాతవాహన యూనివర్సిటీలో పీజీ చేస్తున్నాను. ఇక్కడే ఇంత పెద్ద జాబ్ మేళా నిర్వహించడం ఆనందంగా ఉంది. చదువు పూర్తికాగానే హైదరాబాద్ వెళ్లి జాబ్ చేద్దాం అనుకున్నా. ఈ మేళాలో ఉద్యోగం సాధించి నా కల నెరవేర్చుకున్నా..

ఆదివారం ప్రత్యేకం

కనుమరుగవుతున్న కచ్చురం

యంత్రాల రాకతో కనిపించని ఎడ్లబండ్లు

● శిథిలాలుగా మిగిలిపోయిన పరిస్థితి

ఒకప్పుడు పల్లెటూరుకు వెళ్తే ఎడ్ల బండ్లు కనిపించేవి. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతో గొప్పవాళ్లు అనేవాళ్లు. జోడెడ్ల బండి ఇంటికి ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. ప్రధానంగా రైతులు వ్యవసాయ పనులకు రవాణా సాధనంగా వినియోగించేవారు. అదే బండిపై ఇంటిల్లిపాదీ జాతర్లకు, శుభకార్యాలకు వెళ్లేవారు. బయల్దేరే ముందు బండిని రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేనివాళ్లు వారి అవసరాలకు అడిగి తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఏదో ఒక పల్లెటూరిలో ఒకటి రెండు మాత్రమే కనిపిస్తున్నాయి. అన్నదాతలకు బతుకునిచ్చిన కచ్చురం కాలక్రమేణా వైభవాన్ని కోల్పోయింది.



శిథిలంగా మిగిలిన ఎడ్ల బండి చక్రాలు



మల్రిగడ్డలో ఫర్టిలైజర్ దుకాణం ఎదుట ప్రదర్శన కోసం షెడ్డులో నిలిపిన ఎడ్ల బండి

చందుర్తి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎడ్ల బండ్లు చరిత్రకు ఆనవాళ్లుగా మిగిలాయి. సరైన రహదారి, రవాణాకు అంతగా వాహనాలు లేని రోజుల్లో కాడెద్దుల బండే రవాణా సాధనం. రైతులు పొద్దున్నే సద్దిగట్టుకొని ఎడ్లబండిపై పొలాలకు వెళ్లేవారు. ఎరువులు, విత్తనాలు, గ్రాసం, ఇలా దేన్నైనా ఎడ్లబండి మీదే తరలించేవాళ్లు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న సమయంలో ఎడ్ల బండ్లకు ఫుల్ డిమాండ్ ఉండేది. సీజన్ ఆరంభంలో పొలాలకు పెంట తరలించడం మొదటి పని, పొలం దున్నేందుకు అవసరమైన నాగళ్లు, గొర్రులను రైతులు ఎడ్లబండిపైనే తీసుకెళ్లేవారు. పండిన వడ్లు పట్టించేందుకు రైస్ మిల్లుకు వెళ్లే రవాణా సాధనమూ ఎడ్లబండే. ఇంట్లోకి కావాల్సిన వంట చెరుకు, పశువుల పాకలు, ఇల్లు కట్టేందుకు అవసరమైన కలప ఎడ్లబండ్ల పైనే తెచ్చేవారు. నాడు రవాణా సౌకర్యం అంతంతమాత్రం కాబట్టి ఇంటిల్లిపాదీ జాతరకు వెళ్లాలంటే ఎడ్లబండే బస్సు, కారు అన్నీ. బయల్దేరే ముందు బండిని రంగురంగుల కాగితాలతో అలంకరించేవారు. ఒక ఇంట్లో ఎడ్ల బండి, కాడెద్దులు ఉంటే ఆ రైతును మోతబరి అనే వారు. బండి లేని వారు అద్దెకు ఎడ్లబండి తీసుకెళ్లేవారు. కలపతోనే కమ్మరులు చక్రాలు, బాడీతోపాటు బండికి అవసరమయ్యే విడి భాగాల తయారు చేసేవారు. వడ్రంగులు, కమ్మరుల పని ప్రదేశాలు హడావుడిగా కనిపించేవి. ఎడ్ల బండి తయారీకి అప్పట్లో చాలా తక్కువ ఖర్చయ్యేది. తయారీకి ఇరుసు, ఖానీ, నొగళ్లు, గొలుసు, సాయినీలా, బడితెలు, కోలు అవసరమవుతాయి ఇప్పుడు అక్కడక్కడా ఇనుప చక్రాలతో తయారు చేసిన బండ్లు కనిపిస్తున్నాయి. ట్రాక్టర్ వచ్చి ఎడ్ల బండి మనుగడను తొక్కేసింది. క్రమక్రమంగా 'కాడెడ్ల కచ్చురం' కాలంలో కనుమరుగవుతోంది. ఎడ్ల బండి అంటే అప్పట్లో పిల్లల్లో క్రేజ్ ఉండేది. పెద్దలు ఎడ్లబండిపై పొలానికి వెళ్తున్నప్పుడు పిల్లలు కూడా సరదాగా ఎడ్ల బండి ఎక్కేవారు. ఇప్పటి పిల్లలకు ఎడ్లబండి అంటే ఏమిటో తెలియని పరిస్థితి. ఎడ్లు, ఎడ్లబండితోనే పొలం పనులు మొదలయ్యేవి. ఆ రోజులు మళ్లీ రావు. కాలం మారుతున్న కొద్దీ ఎడ్లబండ్ల సంస్కృతీ పోతున్నది.



మూడపల్లిలో ఓ ఇంట్లో శిథిలమైన ఎడ్లబండి

ఎడ్లబండి ఇంటికి కళ తెచ్చేది

- ఇందూరి హరిబాబు, మల్రిగడ్డ



నాడు గ్రామాల్లో ఎడ్లబండ్లు ఎక్కువగా కనిపించేవి. ఎడ్లబండి ఉన్న ఇంటికి ప్రత్యేక ఆకర్షణ. ఇంటి ముందు బండి ఉందంటే ఎంతోగొప్ప. ఇంటికి కళ తెచ్చేది. ఎడ్ల బండి ఉన్న ఇంట్లో రెండు ఎడ్లు ఉండేవి. ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండి మీదే వెళ్లేవాళ్లు, ఇప్పుడు అక్కడక్కడా ఒకటీ రెండు బండ్లు కనిపిస్తున్నాయి. అవి కూడా ఇనుముతో తయారు చేసినవి. కొన్ని టైరు బండ్లు. రాబోయే తరానికి ఎడ్ల బండి ఎలా ఉంటదనేది తెలియడం కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేసిన పాతకాలంనాటి ఎండ్లబండిని ప్రదర్శన కోసం ఉంచాను.

ట్రేడ్ లైసెన్స్‌ల పేర సైబర్ నేరస్థుల ఫోన్ కాల్స్

- మున్సిపల్ కార్పొరేషన్ నుంచి మాట్లాడుతున్నామంటూ వ్యాపారులను నమ్మించే యత్నం

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరస్థులు ఏ అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఇన్నాళ్లు లాటరీలు, పార్సిళ్లు, బ్యాంకులు, ఉద్యోగాల పేరుతో మోసగించిన సైబర్ నేరస్థులు ఇప్పుడు చిన్నచిన్న పట్టణాలు, గ్రామాల్లో చిన్నచిన్న వ్యాపారులకు సైతం ప్రభుత్వాధికారుల పేర ఫోన్ చేసి బెదిరిస్తూ దండుకుంటున్నారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో నుంచి మాట్లాడుతున్నామంటూ శనివారం గోదావరిఖని పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఫోన్లు చేసిన సైబర్ నేరస్థులు ట్రేడ్‌లైసెన్స్‌లు ఒకే దశ చెల్లించే అవకాశం వచ్చిందని, వెంటనే తాము చెప్పిన నంబర్‌కు ఫోన్ చేస్తే అప్‌డేట్ చేస్తామని, లేదంటే 45 రోజులు షాపు సీజ్ చేస్తామంటూ బెదిరింపులకు గురిచేశారు.

శనివారం మాతంగి కాంప్లెక్స్‌లోని ఒక సూపర్ మార్కెట్ యజమానికి, కళ్యాణ్‌నగర్ లోని మరో ఏజెన్సీ నిర్వాహకుడిగా, లక్ష్మీనగర్‌లోని మరో నలుగురు వ్యాపారులకు ఇదే తరహా ఫోన్లు వచ్చాయి. షాపు పేరు, యజమాని పేరు చెబుతూ ఒకే దఫా 9990 రూపాయలు చెల్లిస్తే భవిష్యత్‌లో ట్రేడ్ లైసెన్స్ చెల్లించే అవసరం ఉండదని, నగరంలో చాలా మంది వ్యాపారులు ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారంటూ నమ్మించే యత్నం చేశారు. గత సంవత్సరం కూడా ఇదే తరహా పలువురు వ్యాపారుల నుంచి సైబర్‌నేరస్థులు డబ్బులు దండుకున్నారు. కాగా బీహార్, గుర్గావ్ తదితర ప్రాంతాల నుంచి సైబర్ నేరస్థులు తెలుగులో మాట్లాడుతూ ఈ తరహా మోసాలకు పాల్పడినట్టు తెలిసింది.

రోడ్డుపై రూ. మూడు లక్షలు

పోలీసులకు అప్పగించిన వ్యాపారస్తులు



సీఐకి డబ్బు అప్పగిస్తున్న మారుతి, కిరణ్

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో రోడ్డుపై పడి ఉన్న మూడు లక్షల నగదును కొందరు వ్యాపారులు గమనించి వెంటనే వాటిని పోలీసులకు అప్పజెప్పారు. పట్టణంలోని పాత బస్టాండ్ చావిడికి వెళ్లే మార్గంలో మారుతి మసాల దుకాణం ముందు 500 రూపాయల నోట్ల కట్టలు (3 లక్షల రూపాయలు) పడి ఉండడాన్ని షాపు యజమానులు సామా మారుతి, కంభంపాటి కిరణ్‌కుమార్ గమనించారు. వెంటనే వాటిని మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ నిరంజన్ రెడ్డికి అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరివైన డబ్బులు పోగొట్టుకుంటే సరైన ఆధారాలు సమర్పించి డబ్బులు తీసుకెళ్లాలని కోరారు. మానవత్వంతో డబ్బులు అప్పగించిన మారుతి, కిరణ్‌ను సీఐ అభినందించారు.

బావిలో దూకి మహిళ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధూర్ గ్రామానికి చెందిన తెలుకంటి శ్యామల(55) శనివారం గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఇబ్రహీంపట్నం ఎస్‌ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్యామలకు పదేళ్ల నుంచి మానసిక స్థితి బాగలేదు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలి భర్త నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో జరగనున్న జాతీయస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల వరంగల్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు విష్ణువర్ధన్, వినయ్, గైని నక్షత్ర జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు జరగనున్న జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కడారి రవి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి బి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నందెల్లి మహిపాల్, అథ్లెటిక్స్ సంఘ సభ్యులు అభినందించారు.



క్రీడాకారులతో అథ్లెటిక్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు నందెల్లి మహిపాల్

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక



గణిత ప్రదర్శన చేస్తున్న విద్యార్థిని శ్రీహిత

కథలాపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్థాయిలో శనివారం నిర్వహించిన ఇన్‌స్పైర్ పోటీల్లో తక్కళ్లపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీహిత మూడు కోణాల మొత్తం 180 డిగ్రీలు, చతుర్భుజంలోని నాలుగు కోణాలు 360 డిగ్రీలని కార్డులతో ప్రయోగపూర్వకంగా చేసిన ప్రదర్శన జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైందని హెచ్‌ఎం మోటూరి రవీందర్ తెలిపారు. గైడ్ టీచర్‌గా గణిత ఉపాధ్యాయుడు యాగండ్ల గంగాధర్ వ్యవహరించారు. విద్యార్థిని శ్రీహితను తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర సలహాదారు రాంప్రసాద్, డీసీఈబి కార్యదర్శి మురళీమనోహరాచారి, పరీక్షల కమీషనర్ రాజమౌళి, ఎంఈవో లోకిని శ్రీనివాస్ అభినందించారు.

వైభవంగా సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, అయ్యప్ప స్వాములు



మల్లన్న జాతరలో నృత్యాలు చేస్తున్న శివసత్తులు



మల్లన్న బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్థులు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

కోరుట్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని జ్ఞాన సరస్వతిమాత శనైశ్చర సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు పాలెపు రాంశర్మ, వినయ్ శర్మ మంత్రోచ్ఛారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను జరిపారు. సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అర్చన అభిషేక కార్యాక్రమాలను నిర్వహించి ప్రత్యేక వేదిక ద్వారా వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అయ్యప్ప స్వాములు చేసిన భజన కార్యక్రమంతో ఆలయ ఆవరణ మారుమోగింది. మెదట సుబ్రహ్మణ్య స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఉరేగింపు తీసుకరాగా మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. భక్తులకు గుండేటి నాగరాజు - రాధ దంపతులు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, దేవాలయ కమిటి సభ్యులు తోట రాజు, కాసు కాంగ్రి జుంబర్తి రమేష్, గట్ల ఆనంద్, నిమిషకవి నాగరాజు, మరిపల్లి రవీగౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర

కోరుట్ల రూరల్: షష్ఠి పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అయిపూర్ గ్రామంలో మల్లన్న జాతర మహోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. యాదవ సాంప్రదాయ ప్రకారం ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గుట్టపై మల్లన్న దేవుడికి పరిసర గ్రామాల భక్తులు పూజలు చేశారు. మహిళలు నెత్తిన బోనాలను పెట్టుకొని గ్రామం నుంచి మల్లన్న ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళలు బోనాల శోభాయాత్రలో శివసత్తులు, పోతరాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. బోనాలను మల్లన్నకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్ ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మాజీ సర్పంచ్ పిడుగు రాధ- సందయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శిగా ప్రసాద్

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని సబ్బితంకు చెందిన గుమ్మడి ప్రసాద్ మెజార్టీతో ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ పద్ధతిలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా ప్రధాన కార్యదర్శి పదవికి ప్రసాద్ ఎన్నికయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

ధర్మారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆక్యుపెషర్ థెరపీ ట్రీట్మెంట్, నాచురోపతి క్యాంప్‌నకు స్పందన లభించింది. పలువురికి ఉచితంగా వైద్యులు సిఆర్ చౌదరి, రేవంత్ చైదరి, మహేంద్రసింగ్ చికిత్స అందించారు. క్యాంపు ప్రారంభరోజు 50 మంది వరకు చికిత్స తీసుకున్నట్లు క్లబ్ అధ్యక్షులు మామి డిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తాళ్లపెల్లి సురేందర్, ఎలగందుల అశోక్ పాల్గొన్నారు.

స్వీట్ల పంపిణీ

ఓదెల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి ఏడాది పూర్తి అయిన సందర్భంగా మండల కేంద్రంలో శనివారం మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేశారు. సింగిల్‌విండో డైరెక్టర్ చింతం కుమార స్వామి, మాజీ ఎంపీటీసీ ఆవుల ముత్తయ్య, మిట్టపల్లి మహేందర్, మాజీ ఆదర్శ రైతు నోముల మాధవరెడ్డి, వంగ రవీందర్, కొప్పుల సత్యం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దివ్యాంగుల దినోత్సవం

ఓదెల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. అనంతరం కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో తిరుపతి తహసిల్దార్ యాకయ్య, ఎంపీవో షబ్బీర్, దివ్యాంగుల సంఘం మండల అధ్యక్షుడు సంపత్, ఏపీఎం లతామంగేశ్వరి, దివ్యాంగులు చింతకుంట వెంకటరెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ఓదెల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన సీపీఐ గ్రామ కార్యదర్శి సూత్రాల స్వామి, సూత్రాల పోచయ్య తల్లి లక్ష్మి ఇటీవల మృతిచెందగా శనివారం జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, మండల కార్యదర్శి కోడం స్వామి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం లక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు రంగు శంకర్ గౌడ్, ఆళ్ళ చిన్న శ్రీనివాస్ రెడ్డి, పల్లె గట్టయ్య, తుమ్మల సదయ్య, సమ్మెట నాగేందర్ పాల్గొన్నారు.

'సాయిమణికంఠ'లో వండర్ జూబ్లీ

ధర్మారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని సాయిమణికంఠ మాడ్రన్ హై స్కూల్‌లో వండర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లులకు ఎంటర్‌టైన్‌మెంట్ ప్రోగ్రామ్స్ నిర్వహించి ఉత్సాహాన్ని నింపారు. అనంతరం వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్ సాంద్ర, కరస్పాండెంట్ జైనా సురేష్, ఎండీ జైనారమాదేవి, ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలోని పూణేలో గతనెల 27నుంచి 30వరకు జరిగిన కరాటే నేషనల్ లెవల్ పోటీల్లో మండలంలోని వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికలు వెలుతురు నిహారిక, ఈర్ల శ్రీనిత కరాటేలో ప్రతిభ కనబరిచి రెండు బంగారు పథకాలు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, కరాటే మాస్టర్ రమేష్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు

- జంగాలపల్లిలో 634 మందికి డ్రా ద్వారా ఎంపిక



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



కార్యక్రమానికి తరలివచ్చిన లబ్ధిదారులు

జ్యోతినగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామగుండం కార్పొరేషన్ 5వ డివిజనల్ పరిధిలోని జంగాలపల్లిలో నిర్మించినడబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులకు శనివారం ఫ్లాట్లను కేటాయించారు. ఎన్టీపీసీలోని లక్ష్మీనర్సింహా గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ డ్రా ద్వారా గతంలో ఎంపికైన 634 మంది లబ్ధిదారులకు ఫ్లాట్లను కేటాయించారు. జంగాలపల్లిలో 3 అంతస్తుల్లో 634 డబుల్‌బెడ్ రూంలను నిర్మించారు. మొత్తం 224 గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రెండు గదుల ఇళ్లలో 23మంది దివ్యాంగులకు డ్రా ద్వారా గ్రౌండ్‌ఫ్లోర్ ఫ్లాట్లను కేటాయించారు. కొన్ని మౌళిక వసతులు పూర్తి చేసి త్వరలోనే ఆయా డబుల్ బెడ్‌రూంలను లబ్ధిదారులకు అందజేస్తామని అధికారులు ప్రకటించారు. కాగా, లబ్ధిదారులకు ఫ్లాట్ల కేటాయింపు ప్రక్రియను సాఫీగా నిర్వహించేందుకు లక్ష్మీనర్సింహ గార్డెన్స్ బయటే గతంలో ఎంపిక చేసిన పత్రాలను పరిశీలించి కేవలం లబ్ధిదారులను మాత్రమే అనుమతించారు. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, రామగుండం తహసీల్దార్ జి.కుమారస్వామి ఆధ్వర్యంలో డ్రా, ఫ్లాట్ల కేటాయింపు జరిగింది. ఎలాంటి గొడవ జరగకుండా ఏసీపీ ఎం.రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

తాము ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఫ్లాట్ల కేటాయింపు కార్యక్రమంలో మక్కాన్‌సింగ్ ప్రసంగిస్తూ గత పదేళ్లలో రామగుండంలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదని, తాను ఎమ్మెల్యేగా గెల్చిన తరువాత ఏడాది కాలంలోనే కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేయించానని పేర్కొన్నారు. ఇప్పటికే 300 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు నడుస్తున్నాయని, ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి రామగుండంకు 20 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే రహదారుల కోసం మరో 60.50 కోట్ల రూపాయలను ఆర్అండ్‌బికి ఒత్తిడి చేసి మంజూరు చేయించానని తెలిపారు. ఏడాదిలోనే నియోజకవర్గంలో నర్సింగ్ కళాశాలను ప్రారంభించామని, డెంటల్ కళాశాల మంజూరైందన్నారు. గతంలో మంజూరై బీఆర్ఎస్ నాయకుల చేతగానితనం వల్ల వెనుకకుపోయిన ఈఎస్ఐ ఆసుపత్రిని ఇక్కడికి మంజూరు చేయించామన్నారు. 150 కోట్ల రూపాయలతో 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. అంతర్గాంలో 150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిరిశిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుతోందని, 6 గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. రెతులకు రుణమాఫీ, రైతు భరోసా, 500 రూపాయల బోనస్ ఇస్తున్నామన్నారు.

ఎంతో సంతోషంగా ఉంది..

- కొండపాక బన్ని, కేసీఆర్ కాలనీ



డబుల్ బెడ్‌రూం కేటాయించడం సంతోషంగా ఉంది. డ్రాలో గ్రౌండ్‌ఫ్లోర్ రావడం ఇంకా సంతోషంగా ఉంది. చిన్నచితకా పని చేసుకునే మాకు సొంతిల్లు లేదు. సొంతింటి కల నెరవేరింది.

సర్కారుకు ధన్యవాదాలు..

- మెదరి రాజేశ్వరి



నాకు డబుల్ బెడ్ రూం మంజూరైన నాలుగు సంవత్సరాలకు ఫ్లాట్ కేటాయించారు. ఇప్పటికైనా మాకు డబుల్ బెడ్‌రూం ఇచ్చినందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

సొంత ఇల్లుంటే ఎంతో భరోసా..

- సతీష్, పరుశరాంనగర్



సొంత ఇల్లు ఉంటే ఎంతో భరోసా ఉన్నట్లుంటుంది. దివ్యాంగుడనైన నాకు సర్కారు 2 బెడ్ రూం ఇల్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. పెరిగిన కిరాయిలతో అద్దె ఇంట్లో ఉండడం కష్టం.

బాలల హక్కులు, చైల్డ్‌లైన్‌పై అవగాహన

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయాల సమూహంలో గల మండల సమైఖ్య కార్యాలయంలో శనివారం చైల్డ్‌ప్రొటెక్షన్, చైల్డ్ హెల్ప్‌లైన్, బాలల హక్కులపై మహిళ సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సోషల్ వర్కర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహలు, బాల కార్మికులు, బడిబాట పిల్లలు, తప్పిపోయిన పిల్లలు, పారిపోయిన పిల్లలు, లైంగిక వేధింపులు, పిల్లల పట్ల అసభ్య ప్రవర్తన, బాలల హక్కులపై ప్రతి అంశంపై వివరించారు. ఆపదలో ఉండే చిన్నారుల కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేయాలని తెలిపారు. మొబైల్‌లకు అనవసరంగా వచ్చే లింక్‌లను ఓపెన్ చేయొద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో రవికుమార్, డీపీఎంఎస్ రవి, తిరుపతి, నాగేశ్వరరావు, సతీష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడిగా యాంసాని రవికుమార్



రవికుమార్

పెద్దపల్లి కల్చరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి జిల్లా టీఆర్‌టీఎఫ్ అధ్యక్షుడిగా యాంసాని రవికుమార్, గౌరవ అధ్యక్షుడిగా సుంకిశాల ప్రభాకర్‌రావును శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిల్‌లో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ మాట్లాడుతూ ప్రజాపాలన విజయోత్సవాలో భాగంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, విజయోత్సవాలలో ఉపాధ్యాయులు ఉద్యోగులు కూడా భాగస్వాములేనని గుర్తుచేశారు. 317జీవో ద్వారా స్థానికత నష్టపోయిన వారిని స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని, రెండవ పిఆర్‌సి అమలు చేస్తూ పెండింగ్‌లో నాలుగు డీఏలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రావు, మహేందర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, విటల్ శర్మ, రవిందర్‌రావు, రామయ్య, ప్రేమ్‌సాగర్, అల్తాఫ్, దస్తగిరితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ముగిసిన డైరెక్టర్ పర్యటన

జ్యోతినగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ డైరెక్టర్(ఆపరేషన్స్) రవీంద్ర కుమార్ రెండు రోజుల పర్యటన శనివారం ముగిసింది. రెండోరోజు డైరెక్టర్ దేశంలోనే అతిపెద్ద 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును సందర్శించారు. రిజర్వాయర్‌లో నెలకొల్పిన ప్రాజెక్టును పరిశీలించి నిర్వహణ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం డైరెక్టర్ రవీంద్ర దక్షిణాది ఎన్టీపీసీ ప్రాజెక్టుల ఆపరేషన్స్ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. దక్షిణాదిలో ఉన్న రామగుండం ఎన్టీపీసీ, సింహాద్రి(వైజాగ్), కుడిగి(కర్నాటక), వెల్లూర్ (తమిళనాడు), కాయకుళం(కేరళ) ప్రాజెక్టుల నిర్వహణ, ఉత్పత్తి, తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ఎన్టీపీసీలో విద్యుత్ ఉత్పత్తికి అవాంతరాలు రాకుండా అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆపరేషన్స్ విభాగానికి సంబంధించి నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన చేసుకోవాలన్నారు. నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలని డైరెక్టర్ సూచించారు. అనంతరం ఎన్టీపీసీ గెస్ట్‌హౌజ్‌లో మొక్కను నాటారు. రాత్రి డైరెక్టర్ రవీంద్ర తిరిగి హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

పోస్టల్ బీమా చెక్కు పంపిణీ



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న అధికారులు

ధర్మారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడారం గ్రామానికి చెందిన పంచాయితి కార్మికుడు ఎల్లూరి సత్తయ్య కుటుంబానికి పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా వచ్చిన 10 లక్షల రూపాయల చెక్కును ఆ శాఖ అందజేసింది. గతంలో సత్తయ్య ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ)లో ప్రమాద బీమా తీసుకున్నాడు. ఇటివల సత్తయ్య ప్రమాదవశాత్తు మరణించగా పోస్టల్ శాఖ నుంచి 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ వచ్చింది. మండల తహసీల్దార్ ఆరీఫ్ ఉద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దపల్లి డీఎల్‌పీవో వీరబుచ్చయ్య మృతుడి భార్య శంకరమ్మకు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐపీపీబీ తెలంగాణ చీఫ్ మేనేజర్ భాస్కర్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీవో రమేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ అరిగె లింగయ్య మాజీ సర్పంచ్ జారకి శంకరయ్య, పెద్దపల్లి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ నరేష్, బ్రాంచ్ సీనియర్ మేనేజర్ శ్రీనివాస్, మోహన్, సునిత, వినయ్, శ్రీకాంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ముగిసిన జాతీయ స్థాయి వర్క్‌షాప్

రామగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్థోబోటిక్స్ రోబోటిక్స్ జాతీయ స్థాయి వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సింగరేణి రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన నాలుగు రకాలను రోబోలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్నోవేషన్స్ టెక్నాలజీకి చెందిన శిక్షకులు సతీష్, ఫ్యాకల్టీ అడ్వయిజర్ స్వప్న, కో-ఆర్డినేటర్ లోకేష్, శ్రీనాథ్, లావణ్య, సంగీత, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో వేగం..

(3వ పేజీ తరువాయి)

అర్ధంతరంగా నిలిచిపోయిన చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పనులు పూర్తిచేయించేందుకు రూ.513 కోట్లు మంత్రి శ్రీధర్‌బాబు మంజూరు చేయించారు.

● రామగుండంలో జరిగిన అభివృద్ధి..

రామగుండం నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కృషి చేస్తున్నారు. టీయూఎఫ్ఐడీసీ నిధులతో నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులు, రూ.180 కోట్లు అమృత్ నిధులు మంజూరు, ఎస్టీపీల నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించారు. రూ.15 కోట్లతో సింగరేణి ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్, జేఎన్‌టీయూసీ నుంచి గోదావరిఖని ఫైవింక్లయిన్ వరకు రూ.14 కోట్లతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు. చేయించారు. రూ.10 కోట్ల సీఎం స్పెషల్ గ్రాంట్, రూ.40 కోట్ల డీఎంఎఫ్‌టీ నిధులతో వివిధ పనులు చేపట్టారు. రూ.63 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. రామగుండం పై ఓవర్ రైట్ ఆర్మ్, గ్రామాల్లో డబుల్ రోడ్లు, సర్వీస్ రోడ్లకు నిధుల కేటాయింపు, గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో 350 పకడల ఆసుపత్రి నిర్మాణానికి రూ.140 కోట్లు మంజూరు చేయించారు. ఎమర్జెన్సీ వార్డుకు రూ.16 కోట్లు, నర్సింగ్ కళాశాల నిర్మాణానికి రూ.16 కోట్లు, పారా మెడికల్ కళాశాల మంజూరు చేయించారు. రూ.10 కోట్లతో సింగరేణి ఆసుపత్రిలో క్యాత్‌ల్యాబ్, రూ.100 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు, రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరు చేయించారు. రూ.26 కోట్లతో సింగరేణి కాలనీల్లో అంతర్గత రహదారులు, మున్సిపల్‌లో రోడ్లు, డ్రైన్ల అభివృద్ధికి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులు, ఫ్లడ్ గ్రాంట్ క్రింద రూ.2 కోట్లు మంజూరు చేయించారు. రామగుండం అర్బన్ డెవలప్‌మెట్ అథారిటీ ఏర్పాటు చేయించగా, జెన్‌కో, సింగరేణి సంయుక్త ఆధ్వర్యంలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. గోదావరిఖనిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం, బండల వాగు ప్రాజెక్టు ఎలక్ట్రికల్ పనులకు రూ.10 కోట్లు మంజూరు చేయించారు.

పెద్దపల్లి బైపాస్ రోడ్డుతో ప్రమాదాలు తగ్గుతాయి

- కొట్టె లక్ష్మయ్య, శాంతినగర్, పెద్దపల్లి



జిల్లా కేంద్రం అయ్యాక పెద్దపల్లిలో వాహనాల రద్దీ పెరిగింది. దీంతో ప్రమాదాలు జరిగి చాలా మంది దుర్మరణం చెందడంతోపాటు తీవ్ర గాయాలపాలవుతున్నారు. బైపాస్ రోడ్డు వల్ల వాహనాల రద్ది తగ్గితే ప్రమాదాలు కూడా తగ్గుతాయి. బైపాస్ రోడ్డు నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయడం శుభసూచకం.

మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం

- చిరుమల తిరుపతి, దొంగతుర్తి



ఎప్పటి నుంచో బస్ డిపో ఏర్పాటు చేస్తారనే కల ఇన్నాళ్లకు నెరవేరింది. ప్రస్తుతం మా గ్రామాలకు ఎప్పుడో ఒక్క బస్సు నడుస్తున్నది. బస్సు సమయానికి రాకపోవడంతో అదనంగా చార్జీలు చెల్లించి ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తుంది. ఇపుడు బస్ డిపో ఏర్పడితే అన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం ఉంటుందని అందరూ భావిస్తున్నారు.

మా కల నిజమైంది..

- మైలగాని రాంబాబు, రూపునారాయణపేట



మా గ్రామంనుంచి మానేరు మీదుగా వంతెన ఉంటే బాగుండు అని అనుకునేవాళ్లం. ఎమ్మెల్యే విజయరమణారావు కృషితో మా కల నెరవేరబోతోంది. మానేరు వాగు పైనుంచి వంతెన నిర్మాణంతో మా ప్రయాణ బాధలు తీరుతాయి. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మానేరుపై వంతెన నిర్మాణం మాకు గర్వంగా ఉంది. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి...

- బురాన్, రామగుండం



రామగుండంలో ఉపాధి అవకాశాలు చాలా వరకు తగ్గాయి. ఓపెన్‌కాస్టుల్లో, పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి ఇవ్వాలన్న ఒత్తళ్లు పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్, అనుబంధ పరిశ్రమలు తీసుకురావాలి. ఆ దిశగా ఎమ్మెల్యే ఒత్తిడి తేవాలి.

ఏడాది పాలన సంతృప్తికరం..

- గోటికార్ కిషన్‌జీ, మంథని



కాంగ్రెస్ ఏడాది పాలన సంతృప్తికరమే. మంత్రి శ్రీధర్‌బాబు గతంలో అభివృద్ధి చేయడమే గాకుండా ఇప్పుడు కూడా వందల కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం గమనార్హం. మంథని రింగ్ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, ఎల్ మడుగును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు రోడ్డు నిర్మాణం, రామగిరి ఖిల్లా అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం అభినందనీయం.

● చిన్న కాళేశ్వరంతో భూములు సస్యశ్యామలం

- గుండా రాజు, బోయినిపేట, మంథని



పదేళ్ల క్రితం అర్ధంతరంగా నిలిచి పోయిన చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు మంజూరు చేయించడం వల్ల తూర్పు ప్రాంత భూములు సస్యశ్యామలం కానున్నాయి. టీపీసీసీ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా శ్రీధర్‌బాబు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీంలను అమలు చేస్తూ, నియోజకవర్గానికి నిధులు తెస్తున్నారు. మరిన్ని నిధులు తీసుకరావాలి.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ధర్మారం, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీలకు ధర్మారం ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పిన్సిపాల్ ఈరవేణి రాజ్‌కుమార్ తెపిపారు. ఇంటర్ మొదటి సంవవత్సరం చదువుతున్న బి.హాసిక, బి.సిందూలు గత నెలలో ఉమ్మడి జిల్లా స్థాయిలో ఆడి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 10 నుంచి 13వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ వాలీబాల్ పోటీల్లో అండర్-19 విభాగంలో వీరు ఆడనున్నారు. ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు బైకని కొమురయ్య, మేకల సంజీవ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ అసభ్య వ్యాఖ్యలు..

- చితకబాదిన తల్లిదండ్రులు.. ల్యాప్‌టాప్, సామగ్రి ధ్వంసం

కోల్‌సిటీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని ఓ ప్రైవేట్ హై స్కూల్ ప్రిన్సిపాల్‌పై శనివారం విద్యార్థి తల్లిదండ్రులు, మరికొందరు దాడికి పాల్పడ్డారు. అతనిపై దాడిచేసి ల్యాప్‌టాప్, సామగ్రిని ధ్వంసం చేశారు. పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి తల్లిని ఉద్దేశించి ప్రిన్సిపాల్ అసభ్యంగా మాట్లాడారని ఆరోపిస్తూ దాడిచేశారు. విద్యార్థుల మధ్య జరిగిన వివాదంలో సదరు విద్యార్థిని పిలిచి మందలించిన సందర్భంగా ఆ విద్యార్థి తల్లి గురించి ప్రస్తావించినట్లు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై యాజమాన్యం సీరియస్ అయినట్లు తెలిసింది. ప్రిన్సిపాల్‌పై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. కాగా, విద్యార్థుల మధ్య ఘర్షణ విషయంలో ఒక విద్యార్థిని మందలించానని, వారి తల్లి దండ్రుల గురించి మంచి చెబుతూ ప్రస్తావించానని, ప్రిన్సిపాల్ వివరణ ఇచ్చారు. అసభ్యంగా మాటడలేదని, తప్పుగా అర్థం చేసుకుని దాడి చేశారన్నారు.

జీడీకే 7ఎల్ఈపీ ప్రమాదంపై డైరెక్టర్ ఆరా



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణరావు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జీడీకే 7ఎల్ఈపీలో జరిగిన ప్రమాదం ఘటనపై సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ఎం, ఆపరేషన్స్) సత్యనారాయణరావు ఆరాతీశారు. శనివారం గనిలో ప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. గని మూసివేత పనుల్లో రక్షణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సత్యనారాయణరావు సూచించారు. డైరెక్టర్ వెంట జీఎం వెంకటయ్య, ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా, జీఎం(యూజీ మైన్స్) రఘురాంరెడ్డి, వీకేపీ పీఓ నెహ్రూ, ఏరియా ఇంజనీర్ నరసింహారావు, అఫీషియేటింగ్ మేనేజర్ చంద్రకుమార్ ఉన్నారు.

యంత్రాల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలి..


రామగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): యంత్రాల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఏపీఏ డివిజన్ పరిధిలో 22కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన ఎఫ్‌బీఎల్(డీజీల్) యంత్రాన్ని, రూ.11లక్షలతో నిర్మాణం చేపట్టిన విశ్రాంతి గది నిర్మాణానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంలు వెంకటేశ్వర్లు, రఘురాంరెడ్డి, అధికారులు యాదయ్య, కొలిపాక నాగేశ్వర్‌రావు, జనార్ధన్, రఘురాం, రాజేంద్రకుమార్, వేణుకుమార్, రవిచంద్ర, నాయకులు రాజుకుమార్, వైవీ రావు, సత్రం సమ్మయ్య కొంరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకల నిర్వహణపై జీఎం సమీక్షా సమావేశం



అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆవిర్భావ వేడుకల నిర్వహణపై శనివారం ఆర్జీ-2 జీఎం బండి వెంకటయ్య డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల 23న అబ్దుల్‌కలాం స్టేడియంలో నిర్వహించనున్న సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాల ని అధికారులకు జీఎం సూచించారు. స్టాల్స్ ఏర్పాటు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగుల కుటుంబీకులకు సరిపడా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు జీఎం సూచించారు. ఈ సమావేశంలో ఓసీపీ-3 పీవో మధుసూదన్, వీకేపీ ప్రాజెక్టు ఆఫీసర్ నెహ్రూ, అధికారులు సంతోష్ కుమార్, రాజాజీ, అనిల్‌కుమార్, మురళీకృష్ణ, ధనుంజయ, ఎర్రన్నతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ఆర్జీ-3,ఏపీఏ ఏరియాల్లో దివ్యాంగుల దినోత్సవం

రామగిరి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏ ఏరియాల్లో శనివారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వర్క్‌పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో సీఈఆర్ క్లబ్‌లో వేడుకలు నిర్వహించారు. గోదావరిఖని మనోచైతన్య సంస్థ, పరిసర గ్రామాలు, పాఠశాలల నుంచి హాజరైన దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి డైరెక్టర్(ఆపరేషన్స్) సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై పోటీల్లో గెలుపొందిన దివ్యాంగులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, కార్పొరేట్ భూగర్భ గనుల జీఎం రఘురాంరెడ్డి, ఇన్‌చార్జి జీఎం రఘుపతి, అధికారి సుదర్శనం, గౌరవ కార్యదర్శి వడ్లకొండ సునీల్‌ప్రసాద్, కృష్ణకుమార్, నరసింహరెడ్డి, డీటీ రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో సింగరేణి మెడికల్ క్యాంప్



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత గ్రామమైన అల్లూరులో శనివారం సింగరేణి ఆర్జీ-2 యాజమాన్యం మెడికల్ క్యాంప్ నిర్వహించింది. వకీల్ పల్లె గని పర్యావరణ ప్రజాభి ప్రాయ సేకరణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని రేమెడియేషన్ కింద అల్లూరు ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటును యాజమాన్యం ఏర్పాటు చేసింది. జీఎం బండి వెంకటయ్య మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. సుమారు 113 మంది గ్రామస్థుల కు సింగరేణి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ప్రభావిత గ్రామాల్లో మౌళిక వసతులు, గ్రామస్థుల ఉపాధి, ఆరోగ్యంపై సింగరేణి మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తామని జీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాదె అంజలీదేవి, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, అధికారులు నరసింహారావు, అనిల్‌కుమార్, డా. మహిపా ల్ పాల్గొన్నారు.